# కాలం కలిగించే మార్పు

కథానిక

శేఖరం కిటికీ ఊచలగుండా శూన్యంలోకి చూస్తూ నిలుచున్నాడు. రాత్రల్లా ఆకుల మీద రాలిన మంచు బిందువులు లేత సూర్యకిరణాలలో తళతళ మెరిసిపోతున్నాయి. పెరటిలో విరబూచిన తెలిమల్లెల మధుర వాసనల సంతరించుకొని, బరువుగా మత్తుగా వీస్తోంది గాలి. శేఖరం మెదడులో ఎన్నెన్నో విచిత్రమైన ఆలోచనాతరంగాలు సుడులు తిరుగుతున్నాయి.

వాకిట్లో "సార్! పోస్టు!" అంటూ వచ్చిన పోస్టు జవాను శేఖరం ఆలోచనలకూ, ఏకాంతానికీ భంగం కలిగించాడు. తన పేరట వచ్చిన రెండు ఉత్తరాలను అందుకొన్నాడు. ఒకటి తన మొదటిభార్య తలితండ్రుల దగ్గరనుంచి. మరో ఉత్తరం తన రెండవ భార్య వ్రాసింది.

మామగారు వ్రాసిన ఉత్తరంవిప్పి చదువుకొన్నాడు.

"చిరంజీవి అల్లుడుగారికి ఉభయకుశలోపరి. రానున్న భానువారం చిరంజీవి రమణడికి అక్షరాభ్యాసంచేయ నిశ్చయమైంది. నీవు సెలవు పెట్టి తప్పక రావలెను. కుర్రవాడుకూడా ఎప్పుడూ "నాన్నా! నాన్నా" అని కలవరిస్తున్నాడు. కనుక ఎలాంటి పరిస్థితులైన తప్పక రావలయును. మేమంతా నీ రాకకు ఎదురు చూస్తూంటాము"

ఉత్తరం చదువుతూన్నంతసేపూ శేఖరానికి తన మొదటిభార్య గుర్తుకొచ్చింది. చావు బ్రతుకులలో ఆమె కడసారిగా అన్నమాటలు స్ఫురణకు రాగానే, మనసు కలత చెందింది. జరిగిపోయిన ఎన్నెన్నో ఘట్టాలు ఒకటొక్కటే అతని స్మృతిపథంలోకి వచ్చాయి. కనులు చెమ్మగిల్లాయి.

* * *

అవి ఆమె కాపురానికివచ్చిన తొలిరోజులు. కెంపులెగబోసే ఆమె నునులేతసిగ్గు దొంతరలూ, మధుర లజ్జా పరికంకలిత మందహాసాలూ శేఖరాన్ని పులకింపచేసేవి. ఆమె స్వర్ణమంజీరనిస్వనాలు అతని హృదయ స్పందనానికి మధుర శ్రుతులు కలిపేవి. ఆమె సితస్మితాలు, అతని హృదయతమస్సులకు క్రొత్తవెలుగులు. ఆ రాగమయ కంఠవినిర్గత కల కూజితాలు, అతనికి వీణానిక్వాణములు. అవి అతని జీవితంలో మరువరాని మధుర స్మృతులు.

కాని కాలం గడిచేకొద్దీ అతని జీవితమే అతనికి భారమైంది. జీవిత రథం రాచబాట వదలి, దారితప్పి, ఎగుడు దిగుడు డొంకలలో పడ్డాది. ప్రసవించడానికి హాస్పిటలుకు వెళ్ళిన భార్య బోసినవ్వులొలికబోసే పసికందుతో తిరిగి వచ్చి, తన యింటిలో అమృతపయస్సులు కురిపిస్తుందని, స్వర్గ దీప్తులు వెలిగిస్తుందనీ ఆసించాడు, ఎన్నెన్నో తీయనికలలుకన్నాడు. కాని విధి మరోవిధంగా తలచింది. ప్రసవించలేక, తీవ్ర వేదనపడి, భార్యమరణించిందని చిచ్చుల పిడుగువంటి వార్త వినగానే శేఖరం కుప్ప కూలిపోయాడు. గుండె ఆగిపోయినట్టయింది. గుండెల్లో చీకట్లు కమ్ముకొన్నాయి. భార్యా వియోగంతో విహ్వలించిపోయాడు.

ఆమె పోతూ ఒక్కగానొక్క కొడుకూ రమణణ్ణి వదలి వెళ్లింది. తల్లి చనిపోయేసరికి రమణడికి సరిగా ఒక్క సంవత్సరం వయస్సు. వాడు మూడుమూర్తులా తల్లిపోలికే. ఆ కళ్ళూ ఆ ముక్కూ ఆ నోరూ అంతా ఆమే. రమణుడు నవ్వితే ఆమె నవ్వినట్లుండేది. భార్య చనిపోయిన కొద్ది రోజులవరకూ శేఖరం రమణడిలో తన భార్య మూర్తిని చూచుకొని సంతృప్తిచెందేవాడు.

"కిరణ్"

కడసారిగా ఆమె మరణశయ్యమీద అన్న మాటలు చెవుల్లో గింగురుమనేవి. ఆమె అంది, "ఇక నే బ్రతకను. నాకోసం మీ రెవరూ దిగులుపడనవసరం లేదు. నేను నిశ్చింతగా ప్రాణం విడుస్తాను. కాని కడకోరిక మాత్ర మొకటుంది. అది మీరు చెల్లించాలి. ముక్కుపచ్చలారని ఆ రమణుడి నిరక్షించే భారం మీరు వహించాలి. వాడే నా సర్వస్వం. నేను ఏలోకంలో ఉన్నా, నా ఆత్మ వాడి యోగక్షేమాలకోసం తాపత్రయ పడుతూంటుంది" అని.

భార్య చనిపోయిన రెండు సంవత్సరాల వరకూ, ఎవరెన్ని విధాల చెప్పినా, శేఖరం పెండ్లి చేసుకోనంటే చేసుకోనన్నాడు. పెండ్లి చేసుకొంటే రమణుడి పోషణ విషయంలో అశ్రద్ధ జరుగుతుందనుకొన్నాడు. కనుకనే ఎవరెన్ని చెప్పినా, అందరి మాటా త్రోసిపుచ్చాడు.

రమణుడి పోషణవిషయంలో ఎంతో శ్రద్ధ తీసుకొనేవాడు. తనే స్వయంగా నీళ్లుపోసి, పోతపాలు పట్టి ఉయ్యాలలో పడుకోబెట్టి నిదుర పుచ్చేవాడు. తను ఆఫీసుకు వెళ్లిన సమయాలలో, కుర్రవాణ్ణి చూచేందుకు నెలకో పది రూపాయలిచ్చి దాదిని ఏర్పాటు చేసుకొన్నాడు.

కాని పిల్లవాడి సంరక్షణకూ ఆఫీసు పనికీ జతపడేది కాదు. దినమూ ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళి, అధికారులచేత మాటలు పడేవాడు.

అప్పుడప్పుడు వెంకట్రామయ్యగారు వచ్చి కుర్రవాణ్ణి చూచి పోతూండేవారు. ఒకొక్క పర్యాయం, నాలుగైదు రోజులు కూడా ఉండి పోయేవాడు.

క్రమేపి, రమణుడు తాతయ్యదగ్గర బాగా మచ్చికయ్యాడు. తాతయ్యను ఒక్క క్షణం ఉండనేవాడు కాడు. తాతయ్యను చూస్తేసరి, ఎగిరి ఆయన భుజంమీదకు గంతులేయాలనే వాడు.

రమణుడికి మూడేండ్లు నిండాయి. వచ్చీ రాని ముద్దు పలుకులతో తప్పడడుగులతో అందరికీ ముచ్చట గొలిపేవాడు.

ఓ రోజు వెంకట్రామయ్యగారన్నారు: "ఏమోయ్! శేఖరం! కుర్రవాణ్ణి నా వెంట తీసుకొని వెడితే నీకేలాంటి అభ్యంతరం లేదనుకొంటాను. వాడి పోషణకూ, నీ ఆఫీసుకు జతపడేట్లు లేదు. నీవు మాత్రం ఎన్నాళ్లని బాధపడతావ్. అసలు వాడికి పోతపాలతో ఆరోగ్యం కూడా చెడుతుందేమోనని భయంగా ఉంది" అన్నాడు కళ్ళజోడులోనుండి అల్లుడి ముఖంలోకి సాభిప్రాయంగా చూస్తూ.

శేఖరం ఒక్క క్షణం ఆలోచించాడు. నిజమే. ఆఫీసు పనికీ, కుర్రవాడి సంరక్షణకూ జతపడటం లేదు. పైగా యీ పోతపాలతో పిల్లవాడు పూర్తిగా చిక్కి శల్యమైనాడు. ఇప్పుడు తనుమాత్రం పరాయివాళ్ళ యింటికి కుర్రవాణ్ణి పంపటంలేదు. వాడు వాడి తాతయ్యగారింటికే వెడుతున్నాడు. వాడిమీద తనకెంత ప్రేమ ఉందో, కూతురు బిడ్డమీద ఆ ముసలాయనకూ అంత ప్రేమ ఉంటుంది.

"ఏమిటోయ్! ఆలోచిస్తున్నావ్" అన్నాడు మళ్ళీ వెంకట్రామయ్య.

"ఆలోచన కేముందండీ! మీరన్నట్లు పోతపాలతో ఈ రెండేళ్లలో కుర్రవాడు పూర్తిగా చిక్కిపోయాడు. వాస్తవంలో వాడి కక్కడ తగిన పోషణ కూడా జరగటం లేదు. ఎంత జీతాలిచ్చి, దాదుల్ని నియమించుకున్నా, అయినవాళ్లు తీసుకొన్నంత శ్రద్ధ తీసుకొంటారా?"

"అదేనోయ్! నేనూ చెప్పేది. ఊరిలో పాల చుక్కకు కొదవలేకుండా ఏదో గొడ్డూ గోదా ఉంది. ఇక ఎవరో ఒక ఆడదిక్కు ఉంటారు పిల్లవాడి రక్షణకు" అన్నాడు వెంకట్రామయ్య.

ఆనాటినుంచి రమణుడు తాతయ్యగారింట్లోనే పెరిగాడు. రమణుడు తాతగారింటికి వెళ్లిన కొత్తలో శేఖరానికి ఏమీ తోచేది కాదు. ఇల్లంతా బావురమన్నట్లువుండేది. ఏవేవో ఏమిటో ఆలోచనలు వచ్చి, మనసును కలత పరిచేవి. ఎప్పుడూ ఎంతో విరక్తిగా కనబడేవాడు. నిరాశ నిస్పృహ ముఖంలో తాండవించేవి. ఆఫీసుకు వెళ్లినా స్నేహితులతో మాట్లాడుతూన్నా, పరధ్యానంగా స్తబ్ధుగా ఉండేవాడు.

రెండు సంవత్సరాలు దొర్లుకొని పోయాయి. కాలం గడచినకొలదీ, శేఖరం జీవితంలో పరివర్తన రాసాగింది. రెండు సంవత్సరాల క్రితం

శేఖరాన్ని చూసినవారు, తర్వాత శేఖరాన్ని పోల్చుకోలేక పోయారు. ప్రపంచమన్నా, ప్రాపంచిక సుఖాలన్నా, విముఖత కనబరుస్తూండిన శేఖరం పూర్తిగా మారిపోయాడు. ఒకప్పుడు చాలాదీనంగా ఉండే అతని ముఖం మీద, చిరునవ్వు తొణికిసలాడుతూ వుండేది. మిలమిల మెరిసిపోయే అతని కనులలో, ఏవో తీయని కొత్త కోరికలు మెదిలేవి. తరుచు సినిమాలకు వెళ్లేవాడు. తరచూ మిత్రులతో కులాసాగా కబుర్లు చెబుతూ గంటల తరబడి కాలం గడిపేవాడు. శేఖరానికి పూర్వపు స్నేహితు లెవరూ లేరు. అంతా కొత్త స్నేహితులు, కొత్త వాతావరణం.

ఒక రోజు శేఖరం రెండో పెళ్ళి చేసికొన్నాడంది లోకం. అనేకులు అనేక విధాల అనుకొన్నారు. కొందరు హర్షించారు. కొందరు ఆగ్రహించారు. శేఖరం కూడా మానవ సహజమైన బలహీనతకు లొంగిపోయాడు. అతనిలో అణగివున్న స్వార్థం విజృంభించింది. శేఖరం తన చర్యను సమర్థించుకొన చూచేవాడు. లోకపు తీరే అంత అని తన మనసును సమాధానపరచుకొన తలచేవాడు. కాని పూర్తిగా అశక్తుడయ్యాడు. అది తనకు కాని పని అయింది. ఏదో పెద్ద తప్పిదం చేసిన వాడిలాగా, మథన పడేవాడు.

రెండో పెళ్లి చేసుకొన్న తర్వాత పూర్తిగా రమణడిని మరిచిపోయాడు శేఖరం. అంతకు క్రితం ఏ వారానికో పది రోజులకో మామగారి ఊరెళ్ళి రమణడిని చూచి వస్తూండేవాడు కాని భార్య కాపురానికి వచ్చింది మొదలూ ఆ ఊసే మానుకొన్నాడు. మామగారు ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు. కాని తను ఒక్క దానికి జవాబీయలేదు ఇక చేసేదిలేక విసువుపుట్టి, ఆయనా ఉత్తరం వ్రాయటం మానుకున్నాడు.

అంచేతనే ఆరోజు మామగారి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం చూచుకుని ఒక్క క్షణం విస్తుపోయాడు.

రెండో ఉత్తరం విప్పి చూచుకొన్నాడు. అది రెండవ భార్య స్వయంగా వ్రాసింది. అవి తను ప్రసవించే రోజులనీ, తనకేమీ తోచటం లేదనీ, వీలైతే ఒకవారం సెలవుపెట్టి రమ్మనీ భర్తను కోరుతూ వ్రాసింది.

శేఖరం పరిస్థితి క్లిష్టమయింది. మరో విషయమయితే అంత ఆలోచనకు అవసరం లేకపోయేది. కాని తన రమణడికి అక్షరాభ్యాసం. మొదటి భార్య మరణశయ్యపై అన్న మాటలు గంటలు కొట్టినట్టు చెవుల్లో గింగురుమన్నాయి. అక్షరాభ్యాసానికి వెళ్ళటమా? మానటమా? అనేది పెద్ద విషమ సమస్యఅయింది శేఖరానికి.

ఇన్ని రోజులుగా వెళ్ళని తను ఈ రోజు వెడితే మామగారూ వాళ్లూ ఏమనుకొంటారు? కనీసం ఆయన వ్రాసిన ఉత్తరాలలో ఒక్కదానికైనా తను సమాధానం వ్రాసిందిలేదు.

"తాతయ్య ఆస్తి కొడుక్కు సంక్రమిస్తుందనగానే, ఇన్నాళ్ళూ లేని మమకారం ఈరోజు పుట్టుకొచ్చింది కొడుకు మీద" అని అంటుంది లోకం. ఆత్మాభిమానానికి, మమకారానికి జరిగిన సంఘర్షణలో మమకారాన్ని చంపుకొన్నాడు శేఖరం. మామగారి ఊరికి వెళ్ళి నలుగురిలో నగుబాట్ల పాలయేకన్నా రమణడికి ఏదేనా బహుమతి పంపిద్దామనుకున్నాడు.

ఆ రోజే బజారుకు వెళ్ళి ఒక చెమ్కీల టోపీ, బుష్‌కోటు, పంట్లాం. పలకా బలపం, బాలశిక్ష ఇంకా ఏవేవో కొనుక్కొని వచ్చి, అన్నీ ఒక పార్శిలుగా కట్టి, "చిరంజీవి రమణడికి" అని పార్శిలుమీద వ్రాశాడు. ఆ పార్శిలు మీద ఆ హడావుడిలో ఏమని అడ్రెసు వ్రాశాడో మామగారి పేర పంపించాడు.

ఆ దినమే రెండో భార్య ఊరికి ప్రయాణమయ్యాడు సెలవుకు వ్రాసి

ఊరికి వెడుతున్నాడే గాని మనసు మనసులో లేదు. ఏదో అసంతృప్తి, ఆవేదన, మనసునే ద్రోహం చేసుకొన్నానేమో అనుకొన్నాడు.

ఊరు చేరుకొనేసరికి బాగా చీకటిపడింది. ఇంటికి వెళ్ళగానే అత్తమామలు కుశలప్రశ్నలు వేశారు. వాళ్ళకేం సమాధానం చెప్పాడో తనకే తెలియదు. ఆకలి కావటంలేదని వెళ్ళి పడుకొన్నాడా రాత్రి ప్రయాణపు బడలికవల్ల సరిగా లేదేమోనని అనుకొన్నారు అత్తమామలు.

"ఏమండీ! అదోలా ఉన్నారు. ఒంట్లో ఏమేనా సుస్తీగా ఉందా?" అంది భార్య.

"నన్ను మాటాడించక కాస్త విశ్రాంతి తీసుకోనివ్వు" అని ఒత్తిగిలి పడుకొన్నాడు.

కునుకు పట్టింది. కలలో మొదటి భార్య కనిపించింది అశ్రుసిక్త నయనాలతో.

"మనరమణుడిని అప్పుడే మరచిపోయారా?" అంది రుద్ధకంఠంతో. ఆమె కనులలోనుంచి గంగా యమునలు స్రవించాయి.

"లేదు. మరిచి పోలేదు" అంటూ ఉలిక్కిపడి లేచాడు శేఖరం.

"ఏమిటండీ. అలా ఉలిక్కిపడ్డారు. ఏదేనా పీడకల వచ్చిందా?" అంది భార్య.

"మరేంలేదు. నేను ఇప్పుడే ఊరికి వెళ్ళాలి. ఒక అత్యవసరమైన పని ఆఫీసులో పూర్తి చేయకుండా వచ్చాను. వెళ్ళకపోతే పై అధికారులనుంచి మాట వస్తుంది."

"అదేమిటండీ! సాయంత్రమేగా వచ్చారు. అప్పుడే వెళ్ళాలంటారేం? అంత అవసరమైతే ఉదయం బండికి వెళ్ళండి" అంది భార్య భర్త విచిత్రప్రకృతికి విస్తుపోతూ.

"వీల్లేదు. ఇప్పుడే వెళ్ళాలి" అని బయలుదేరాడు. అత్తమామలు వారింప చూచారు. కాని వినిపించుకొనేలా లేడని అడ్డుచెప్పలేదు.

శేఖరం ఆరాత్రి బండికే వచ్చి ఊరు చేరుకొన్నాడు, ఇంటికి వచ్చి ఇంట్లో కూర్చున్నాడే కాని, అతడికి ఏమీతోచలేదు. వెర్రి ఎత్తినట్లుంది.

మరునాడు ఉదయం తను పంపిన పార్శిలు తిరిగి వచ్చింది. పార్శిలు తిరిగిరాగానే శేఖరం కనులకు పలుచటి నీటిపొర అడ్డువచ్చింది. చివరికి కన్నకొడుకు అక్షరాభ్యాసానికి బహుమతులైనా సరిగా అందచేయలేక పోయానే అని వాపోయాడు. చేతిలోని పార్శిలు అలాగే కింద జారిపోయింది, శేఖరం అలానే నిశ్చలదృష్టితో చూస్తున్నాడు.

పార్శిలు పైని సరియైన అడ్రెసు వ్రాయక పోవటమే తిరిగి రావటానికి కారణమని, కొద్ది రోజుల తర్వాత మాత్రమే శేఖరం తెలుసుకోగలిగాడు.



శ్రీ వెంకటేశ్వర్లు (ఎదురుగా కూర్చున్నవారిలో మధ్యవారు) భరణీ స్టూడియో కామెరామాన్‌గా వెళ్ళేసందర్భంలో ఇటీవల విజయా కామెరాక్లబ్ వారు చేసిన విందు.